బచ్చన్నపేటలో మాట్లాడుతున్న ఇర్రి రమణారెడ్డి , నాయకులు

నర్మెటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేశ్

తరిగొప్పులలో మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

కేటీఆర్‌పై అక్రమ కేసులు సిగ్గుచేటు

- **కేసులతో భయపడేది లేదు**
- **జనగామ జిల్లా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు**

జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జనగామ, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌తో పబ్బం గడుపుకుంటున్నదని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులు పెట్టడం సిగ్గుచేటు అని, ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని శుక్రవారం జనగామ జిల్లాలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు బండ పద్మ, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, దయాకర్, సమద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మసియోద్దీన్, జనగామ మండల పార్టీ అధ్యక్షుడు బైరగోని యాదగిరిగౌడ్, నాయకులు పానుగంటి ప్రవీణ్‌కుమార్, తిప్పారపు విజయ్‌కుమార్, ఉల్లెంగుల సందీప్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను గాలికి వదిలి ప్రభుత్వ తప్పులు, హామీలను ఎత్తి చూపుతున్న బీఆర్ఎస్ ముఖ్యనాయకులపై తప్పుడు కేసులు పెట్టి బెదిరించే పనిలో సీఎం రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌లోని ప్రతి ఒక్కరు ఒక్కో సైనికుడిగా పోరాట పటిమ కలిగి ఉంటారని, దొంగ కేసులకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. కేటీఆర్‌పై తప్పుడు కేసు బనాయించి జైలుకు పంపాలని చూసిన సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌కు ఈ నెల 30 వరకు అర్జెసు చేయవద్దని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వు చెంపపెట్టు అని అన్నారు. ఒక్క కేటీఆర్‌ను కేసులో ఇరికించి పాలన సాగిద్దామని చూస్తున్న ప్రభుత్వ ఆటలను గులాబీ సైనికులు సాగనివ్వరని, అసెంబ్లీలో చర్చించినందుకు అక్రమ కేసు పెట్టడం సిగ్గుచేటు... ఖబర్దార్ రేవంత్ రెడ్డి.. కేసులకు భయపడే వ్యక్తులను కాదు..మేం కేసీఆర్ సైనికులం అని హెచ్చరించారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

మాట్లాడుతున్న బాల్దె విజయ

జనగామ రూరల్ : కేటీఆర్‌పై అక్రమ కేసులకు ఎవరూ భయపడరని జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్‌పర్సన్ బాల్దె విజయ అన్నారు. శుక్రవారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. కేటీఆర్‌పై ఫార్ములా ఈ- కార్ రేస్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ఇలాంటి కేసులు తెలంగాణ ఉద్యమంలో వందలు నమోదు చేశారని, అప్పుడే భయపడలేదు.. ఇప్పుడు భయపడేదేలేదన్నారు. అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డి అమలు కానీ హామీలు ఇచ్చి వాటిని అమలు చేయాలని నిలదీస్తుండటంతో ఏం తోచక కేసులు నమోదు చేస్తున్నారన్నారు. కేసులు పెట్టి నోరు ముయించాలనే ప్రభుత్వ నీచ ఆలోచనను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేటీఆర్‌పై కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయమంటే అక్రమ కేసులా..

బచ్చన్నపేట : ఎన్నికల వేల ఆరుగ్యారెంటీల పేర ప్రజలను ప్రలోభపెట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు అవి అమలు చేయాలని ప్రజల పక్షాన పట్టుబడుతున్న ప్రతిపక్షాల నాయకులపై తప్పుడు కేసులు పెట్టాలని చూడడం ప్రభుత్వ దుర్నీతికి నిదర్శమని రైతు బంధు సమితి జిల్లా మాజీ కోర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కేటీఆర్‌పై తప్పుడు కేసు నమోదుచేయడం అప్రజాస్వామికమన్నారు. హైదరాబాద్ ఖ్యాతిని ఖండాంతరాలు దాటించాలని ఫార్ములా ఈ- రేస్‌ను తెలంగాణలో జరపాలని కేటీఆర్ చూస్తే, దాన్ని ఒక స్కాంగా చూసిన రేవంత్‌రెడ్డి రద్దు చేయడమేకాక, కేటీఆర్‌పై కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్ నేతలు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. వారు చేస్తున్న వ్యతిరేక పాలనను ఎండగడితే కేసులు పెట్టాలని చూస్తున్నారన్నారు. ఆరుగ్యారెంటీల నుంచి దృష్టి మళ్లించేందుకు ఇలాంటి డైవర్షన్ రాజకీయలు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, గంధమాల నరేందర్, ఎం అజీం, దస్తగిరి, సిద్ధిరాములు, కోడూరు శివకుమార్, అనిల్, మల్లయ్య ఉన్నారు.

కేటీఆర్‌పై అక్రమ కేసులను ఖండిస్తున్నాం..

తరిగొప్పుల : ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో అక్రమాలు జరిగాయంటూ కేటీఆర్‌ను ఏ1గా చేర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలపై ప్రశ్నిస్తే ఇలా అక్రమంగా కేసులు పెట్టాలని కుట్రలు చేయడం అవివేకమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించామన్నారు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలో ఏ ఒక్క పథకం పూర్తి స్థాయిలో అమలు చేసిన పాపాన పోలేదన్నారు. రాష్ట్ర ఇమేజ్ పెంచడం కోసం కేటీఆర్ పని చేస్తే నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆయనపై కేసులు నమోదు చేసి రాక్షస ఆనందం పొందుతున్నదని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు, కేటీఆర్‌లు అసెంబ్లీలో ప్రశ్నలు వేస్తుంటే కాంగ్రెస్ నేతలు నీళ్లు నములుతున్నారని అన్నారు. అసెంబ్లీలో చర్చ పెడితే తాము సిద్ధమని కేటీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిలువేరు లింగం, మాజీ ఎంపీటీసీ జూంలాల్‌నాయక్, గ్రామశాఖ అధ్యక్షుడు అంకం రాజారాం, నాయకులు చెన్నూరి సంజీవ, వంగ రామరాజు, తాళ్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, బూస యాదగిరి, సుంకరి రాజయ్య, తాళ్లపల్లి పోశయ్య, యూత్ అధ్యక్షులు మల్యాల సుధీర్, కొండ కుమార్, జయపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి కక్షపూరిత చర్య..

నర్మెట : కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతూ కేటీఆర్‌పై అక్రమంగా కేసులు నమోదు చేశారని పార్టీ మండల అధ్యక్షుడు చింతకింది సురేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దమ్ముంటే ఫార్ములా ఈ-కార్ రేసుపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని అన్నారు. ఈ రేసులో అవినీతి జరిగితే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై అసెంబ్లీలో చర్చ పెడితే ఎవరు ఏంటో ప్రజలే నిర్ణయించుకుంటారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తప్పుదోవ పట్టించేందుకు తెరమీదకు రోజుకో ప్రచారాన్ని తీసుకువస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్‌నాయక్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ గౌస్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నీరేటి సుధాకర్, మాజీ సర్పంచులు ఆమెడపు కమలాకర్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, రామిని శివరాజ్, ముప్పిడి ప్రతాప్, లకావత్ కిరణ్‌నాయక్, నర్మెట గ్రామ అధ్యక్షుడు నక్కల రవి, నాయకులు పండుగ మల్లేశం, కొన్నె చంద్రయ్య, గుడికందుల నరహరి, భూక్యా లాలునాయక్, చేర్యాల సత్యనారాయణ, గోపగోని రవి, బెడుదం సుధాకర్, సమ్మయ్య, మహేందర్, మహేశ్వరం రాధాకృష్ణ, శనిగరం నరేశ్, హెండిగ హరికృష్ణ, పులి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ అర్బన్ పీఎస్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఏసీపీ పార్థసారథి

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఏసీపీ

జనగామ చౌరస్తా, డిసెంబర్ 20 : నిరంతరం విధుల్లో అప్రమత్తంగా ఉండాలని జనగామ ఏసీపీ పార్థసారథి అన్నారు. శుక్రవారం స్థానిక అర్బన్ పీఎస్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్‌శాఖ తరపున సిబ్బందికిచ్చిన ట్రంక్ బాక్స్, యూనిఫాం, బెల్ట్, షూస్, సాక్స్, లాఠీ వంటి సామగ్రిని పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఏసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కర్తవ్యం నిర్వర్తించాలన్నారు. కాగా, ఏసీపీకి అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజేశ్‌కుమార్, మాచర్ల శ్వేత, చెన్నకేశవులు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 20 : యువత గంజాయి, గుట్కా, గుడుంబా, గ్యాంబ్లింగ్ వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడొద్దని, వీరిపై తల్లిదండ్రులు పర్యవేక్షించాలని ఏసీపీ భీమ్‌శర్మ సూచించారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని మోడల్ కాలనీలో వరంగల్ సీపీ ఆదేశాల మేరకు ఏసీపీ భీమ్‌శర్మ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి 23బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. 4.9లీటర్ల మద్యం, రూ.506 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ జీ వేణు, స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి ఎస్సైలు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీ

దేవరుప్పుల, డిసెంబర్ 20 : దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య పూర్తి స్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా ఏసీపీ పోలీస్‌స్టేషన్ నిర్వహణ, పరిసరాలు, వస్తువులు, పరిశీలించారు. అనంతరం కార్యాలయ రిజిస్టర్లు, ఇన్వెస్ట్‌గేషన్ చేసిన కేసులు, పెండింగ్‌లో ఉన్నవి అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగారు. ఈ తనిఖీలో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, స్థానిక ఎస్సై సృజన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గొల్లపల్లిలో వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించిట్టు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. ఈ ట్రాక్టర్లు యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లికి చెందిన ననుబాల రమేశ్, ననుబాల యాకస్వామిలకు చెందినవిగా గుర్తించామన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

కస్తూర్బా విద్యార్థినులకు బ్లాంకెట్లు పంపిణీ

లింగాలఘనపురం/దేవరుప్పుల, డిసెంబర్ 20 : మండలకేంద్రాల్లోని కస్తూర్బా విద్యార్థినులకు శుక్రవారం అధికారులు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. చలితీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సమగ్ర శిక్ష పథకంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బ్లాంకెట్లు అందించారు. లింగాలఘనపురంలో ఎంపీడీవో జలేంధర్‌రెడ్డి, ఎంఈవో విష్ణుమూర్తి, స్పెషలాఫీసర్ అన్నపూర్ణ, దేవరుప్పులలో ఎంఈవో కళావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

దేవరుప్పుల, డిసెంబర్ 20 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక రాష్ట్ర చైర్మన్ గోదుమల కుమారస్వామి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ ఉద్యకారుల వేదిక మండల స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం మండల కమిటీ ఏర్పాటు చేశారు. కడవెండికి చెందిన కత్తుల సుధాకర్ అధ్యక్షుడిగా, గొల్లపల్లికి చెందిన జక్కుల సర్వయ్య కార్యదర్శిగా, సహాయకార్యదర్శిగా జోగు రవి, మరాఠి యాదగిరి, గొడిశాల రాములు, మూఢ రమేశ్, మేడ చిరంజీవి, కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

ప్రభుత్వ పాఠశాలకు టీవీ బహూకరణ

బచ్చన్నపేట, డిసెంబర్ 20 : వీఎస్ఆర్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్థానిక రైస్ మిల్ యజమాని దాస నర్సయ్య స్మార్ట్ టీవీ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం కోరిక మేరకు తన కుమారుడు దాస అరుణ్ జన్మదినం సందర్భంగా పాఠశాలకు ఎల్ఈడీ టీవీ అందించినట్టు తెలిపారు. హెచ్ఎం దాస్యం వెంకటకృష్ణ, స్థానిక వ్యాపార వేత్తలు పసునుల రమేశ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దీపారాణి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకం

దేవరుప్పుల, డిసెంబర్ 20 : విధులు నిర్వర్తిస్తున్న పాఠశాలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈవో కళావతి అన్నారు. మాధాపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఇటీవల బదిలీపై వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. హెచ్ఎం నల్ల లలిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈవో హాజరై మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులు గోలి తిరుపతిరెడ్డి, ఆర్ మనోహర్‌లను సన్మానించారు. కాగా, బదిలీ ఉపాధ్యాయులు తమ పిల్లలపై ఉన్న ప్రేమతో వారికి రూ.8వేల విలువ గల దుస్తులు బహూకరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విష్ణు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు సుర్జీత్, జీవన్, అంగన్‌వాడీ టీచర్ రజిత ఉన్నారు.

అదుపుతప్పి వాహనదారుడు మృతి

కొడకండ్ల, డిసెంబర్ 20 : ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని హక్యతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా, మోత్కూరు మండల కేంద్రానికి చెందిన పందుల నాగేశ్(40) ద్విచక్రవాహనంపై కొడకండ్ల మండలకేంద్రానికి అతివేగంగా వెళ్తున్నాడు. హక్యతండా మూలమలుపు వద్ద అదుపు తప్పి పక్కనే కాలువలో పడడంతో నాగేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సిఉంది.

విద్యుదాఘాతానికి గురై యువకుడు..

అనికేశ్ ఫైల్

తరిగొప్పుల, డిసెంబర్ 20 : విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. గ్రామానికి చెందిన అనికేశ్ (18) ఇదే గ్రామానికి చెందిన మోట మొగిలికి చెందిన వరి కోత మిషన్ మరమ్మతుకు గురి కాగా మరమ్మతు చేయడానికి వెల్డింగ్ మిషన్‌కు కరెంటు సరఫరా చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అనికేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తమకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు అనికేశ్ మృతదేహంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీదేవి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా దవాఖానకు తరలించే ప్రయత్నం చేశారు. బాధితులు తమకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించేది లేదని పట్టుపట్టారు. ఇరువర్గాల మధ్య సయోద్య కుదరడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో కార్మికుల ముందస్తు అరెస్టు

అరెస్టయిన కార్మిక సంఘ నాయకులు

నర్మెట, డిసెంబర్ 20 : తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న సందర్భంగా మండల కేంద్రంలో ఆటో కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులను పోలీసులు శుక్రవారం అక్రమంగా అరెస్టు చేశారు. ఆటో కార్మికులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్న నేపథ్యంలో తమకు బతుకుదెరువుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా చర్యలు చేపట్టాలని కోరుతున్న తరుణంలో అసెంబ్లీ ముట్టడి చేపడుతారని ఆటో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బెడుదం సుధాకర్, నిర్వాహకుడు కందకట్ల వీరమల్లును పోలీసులు శుక్రవారం అక్రమంగా అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

గౌడ ఐక్య సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా తండ రమేశ్

నియామక పత్రం అందజేస్తున్న అంబాల నారాయణగౌడ్

కొడకండ్ల, డిసెంబర్ 20: గౌడ ఐక్య సాధన సమితి జనగామ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ముంద్రాయి గ్రామానికి చెందిన తండా రమేశ్‌గౌడ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు ఐక్య సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాడిశెట్టి వెంకన్న గౌడ్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి : కలెక్టర్

రఘునాథపల్లి, డిసెంబర్ 20 : గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రిజ్వాన్‌భాషా అన్నారు. మండల కేంద్రంతోపాటు ఖిలాషాపురంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో లబ్ధిదారులు ఇండ్ల దరఖాస్తులు చేసుకున్నారా? వారికి సొంత ఇల్లు ఉందా? లేక ఇంటి స్థలం ఉందా అనే కోణంలో సర్వే నిర్వహించాలని కలెక్టర్ సర్వే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మెహ్సిన్, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కవిత, గ్రామస్తులు ఉన్నారు.

కాలువలను పరిశీలించిన ఏఈ

లింగాలఘనపురం, డిసెంబర్ 20 : యాసంగికి మండలంలోని చెరువులను గోదావరి జలాలతో నింపేందుకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. లింగాలఘనపురం, బండ్లగూడెం, గుమ్మడవెల్లి, సిరిపురం, జీడికల్, నాగారం చెరువులను గోదావరి జలాలతో నింపేందుకు భూసేకరణ పూర్తి అయి ఎల్18, ఎల్19,కాలువలను సైతం తవ్వించారు. ఈ క్రమంలో నీటిపారుదలశాఖ ఏఈ లక్ష్మణ్ శుక్రవారం లింగాలఘనపురం రైతుల భూముల నుంచి చెరువుల్లోకి తవ్వించిన ఎల్18, ఎల్19 కాలువలను పరిశీలించారు. మరమ్మతులు గుర్తించి ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. కార్యక్రమంలో ఆయన వెంట కారంపురి చంద్రయ్య, గవ్వల మల్లేశం, బెజ్జం ఆంజనేయులు, కర్రె కృష్ణ పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక రాష్ట్ర 6వ మహాసభలు విజయవంతం చేయాలి

జనగామ చౌరస్తా, డిసెంబర్ 20 : నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే టీఎస్‌యూటీఎఫ్ విద్యా వైజ్ఞానిక రాష్ట్ర 6వ మహాసభలు విజయవంతం చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్ కోరారు. శుక్రవారం జనగామ కలెక్టరేట్ వద్ద టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల ప్రచార వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంజిత్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఈ మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగంపై మేధావుల ఆధ్వర్యంలో లోతైన చర్చ జరుగుతుందన్నారు. మహాసభలకు ముఖ్యఅతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావ రవి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రావు, మడూరి వెంకటేశ్, ఆకుల శ్రీనివాసరావు, కృష్ణ, కృష్ణమూర్తి, సుధాకర్, గోవర్ధన్‌రెడ్డి, కనకయ్య, ఆగయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు, మహేశ్, జంపయ్య, నర్సింహులు, భాస్కర్, అహ్మద్‌పాషా, శ్రీనివాస్, యాదగిరి, మర్రెడ్డి, వేణుమాధవ్, నవీన్ పాల్గొన్నారు.

పేదింటి పెళ్లికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట, డిసెంబర్ 20 : మండల కేంద్రానికి చెందిన మల్గా భాగ్య సిద్ధులు కూతురు కావ్య వివాహం ఆలేరులో శుక్రవారం జరుగగా మండల కేంద్రానికి చెందిన కోడూరు శివకుమార్ పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్గ సిద్ధిరాములు, ఓరుగంటి అయిలయ్య, పారుపల్లి రాములు, మల్గ బాలయ్య, కందుకూరి కనకరాజు ఉన్నారు.

పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించొద్దు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా

పోలీసు కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

చిల్పూరు, డిసెంబర్ 20 : పోలీస్‌శాఖ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో స్టేషన్ అధికారులు వ్యహరించవద్దని వరంగల్ పోలీ స్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా తెలిపారు. వా ర్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం చిల్పూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక పోలీస్ అధికారులు మొక్క అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశా రు. ముందుగా పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పోలీస్‌శాఖ మంజూరు చేసిన కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించడంతోపాటు వచ్చిన ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీషీటర్ల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, కోర్ట్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటికి సంబంధించిన దర్యాప్తు వివరాలను తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సీపీ అంబర్‌కిశోర్‌ఝా మాట్లాడుతూ ప్రధాన రోడ్డు మార్గాల్లో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని కలిగించాలన్నారు. నీతి, నిజాయితీతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఆయన పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ తనిఖీల్లో ఏఎస్పీ మానాన్ భట్ ఘన్‌పూర్ స్టేషన్ ఏసీపీ భీమ్‌శర్మ, రఘునాథపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై